క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఎంపీడీఓ ముత్యాలరావు, యూడీసీ పద్మావతి

అశ్వాపురం: ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలలో మొక్కలు నాటి బాధ్యతతో వాటిని పెంచి వృక్షాలుగా మార్చాలని ఎంపీడీఓ ముత్యాలరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మొక్కలు నాటి పెంచడం వల్ల గ్రామాలు పచ్చదనంతో కళకళలాడి ప్రజల జీవనం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. మొక్కలు నాటి వదిలేస్తే ఉపయోగం లేదని వాటిని బాధ్యతతో సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూడీసీ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

టీఆర్‌వీకేఎస్ నాయకులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న బీటీపీఎస్ సీఈ బిచ్చన్న

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో టీఆర్‌వీకేఎస్ నాయకులు కలకుంట్ల సంతోష్‌రెడ్డి, మధులకు సీఈ బి.బిచ్చన్న చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ.. గత ఏడాది అగ్నిప్రమాదానికి గురైన జీటి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు పూర్తి చేసుకుని మద్రాస్ నుంచి మణుగూరుకు తీసుకొస్తున్న భారీ వాహనం మిట్టగూడెం వద్ద మరమ్మతుకు గురైందని, ఆ వాహనాన్ని టీఆర్‌వీకేఎస్ నాయకులు, ఉద్యోగులు రెండు టెరెక్స్‌ల సహాయంతో నిద్రాహారాలు మాని ప్లాంట్‌కు చేరవేశారని గుర్తు చేశారు. ఆ శ్రమకు ప్రోత్సాహకంగా ప్రశంసలు అందాయి. ప్రశంసాపత్రాలు అందుకున్న సంతోష్‌రెడ్డి, కడపకొండ మధులకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుంట్ల రమేష్, జెన్‌కో సహాయ కార్యదర్శి, బీటీపీఎస్ రీజినల్ అధ్యక్షుడు సాదిక్ పాషాలు శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రోడ్లు ప్రారంభం

గుండాల: మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం పర్యటించారు. గణాపురం, జగ్గాయిగూడెం, తూరుబాక, కొడవటంచ, మామకన్ను గ్రామాల్లో సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. అక్కడి ప్రజలు స్థానిక సమస్యలను ఆయన దృష్టికి తీసుకవచ్చారు. అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. ఇప్పటి వరకు అన్ని గ్రామాల్లో రూ.కోటి వెచ్చించి అంతర్గత రోడ్లకు సీసీ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. పీఆర్ డీఈ రమనాథం, ఇన్‌చార్జ్ తహసీల్దార్ తిరుమల, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ శ్యాంసుందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి ఏఈ మోతిలాల్, ఏపీఓ రవితేజ, ఏఓ వెంకటరమణ, సీఐ రవీందర్, ఎస్సైలు రహూఫ్, సోమేశ్వర్, నాయకులు ఖదీర్, ముత్యమాచారి, అశోక్, పాంబోయిన ముత్తయ్య, కృష్ణయ్య, కిరణ్ పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ప్రైవేటు కళాశాలలు అడ్మిషన్‌ల పేరుతో వసూలు చేస్తున్న అధిక ఫీజులను వెంటనే అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని ఎస్ఎఫ్ఐ సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆకర్షణీయమైన బ్రోచర్లతో విద్యార్థులను బురిడీ కొట్టిస్తున్న ప్రైవేటు కాలేజీల యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీ ఆదివాసీ విద్యార్థులే ఎక్కువ శాతం ఉన్నారని, అమాయక ఆదివాసీ విద్యార్థులను ర్యాంకుల పేరిట ఆకర్షిస్తూ.. విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంపత్, చంద్రరావు, కిరణ్, అశోక్ పాల్గొన్నారు.

'నిరాశపరిచిన ప్రభుత్వం'

దుమ్ముగూడెం: యువత ఆశలను కాంగ్రెస్ ప్రభుత్వం నిరాశపరిచిందని, తక్షణమే రాజీవ్ యువ వికాస పథకం అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు దామెర్లశ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం అమలు తీరుపై ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ గత కేసీఆర్ ప్రభుత్వపాలనలో యువతకు ఇచ్చిన విధంగా సబ్సిడీ ఋణాలు అమలు చేయాలన్నారు.

భూ భారతి సదస్సులు ప్రారంభం

- దరఖాస్తులతో క్యూకట్టిన రైతులు
- మొదటిరోజు సాదాబైనామా సంబంధిత అర్జీలే అధికం
- పర్యవేక్షించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి తీసుకొచ్చిన భూ భారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం పలు గ్రామాల్లో ప్రారంభమయ్యారు. తహసీల్దార్లు, డీటీల నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాల్లో పలువురు రైతులు సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. ప్రజాప్రతినిధులు సదస్సుల తీరుతెన్నులను పరిశీలించారు.



బూర్గంపాడు: రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు తీసుకుంటున్న ఆర్డీఓ, తహసీల్దార్



గుండాల: రెవెన్యూ సదస్సులో భూ సమస్యలు వింటున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఆర్డీఓ దామోదర్ అన్నారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. భూభారతి చట్టంలో దశలవారీగా పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు అవకాశాలున్నాయన్నారు. తహసీల్దార్ శిరీష ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.

దమ్మపేట: మండలంలోని లచ్చాపురం, నాచారం గ్రామ పంచాయతీల పరిధిలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ఎమ్మెల్యే జారె సందర్శించారు. సదస్సులు జరుగుతున్న సరళి, తీరును గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. రెండు సదస్సుల్లో కలిపి మొదటి రోజు 230 దరఖాస్తులు రాగా.. ఎక్కువగా సాదానామా సంబంధిత దరఖాస్తులే వచ్చాయని తహసీల్దార్ భగవాన్ రెడ్డి తెలియజేశారు. తహసీల్దార్ భగవాన్ రెడ్డి, డిటీ వాణి, ఆర్ఐలు వీరాస్వామి, భిక్షం, జేఏ నాయక్, దిశ కమిటీ సభ్యురాలు ఏసుమణి, కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుంటిమడుగు, ఖమ్మంపాడు, నందిపాడులో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రైతుల వద్ద నుంచి మొత్తం 250 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమాల్లో తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్, ఆర్ఐలు కృష్ణ, పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలో మొదటి రోజు నాలుగు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సదస్సులను నిర్వహించారు. ఈ సదస్సులలో ఎక్కువగా వారసత్వం పట్టాలు, భర్త చనిపోతే భార్యకు సంక్రమించే పట్టాలు, భూమి తక్కువ నమోదైంది అనే వాటిపై దరఖాస్తులు వచ్చినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ జగదీశ్వరరావు, ఆర్ఐలు కల్లూరి వెంకటేశ్వరరావు, నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, నేడు రెండో రోజు నర్సాపురం, పాతమారేడుబాక, కోయనర్సాపురం, రామచంద్రునిపేట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సదస్సులను నిర్వహించనున్నారు.

గుండాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా.. మామకన్నులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజయర్యారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని భూ సమస్యల కోసమే భూ భారతి చట్టాన్ని ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని చిన రాయిగూడెంలో తహసీల్దార్ అద్దంకి నరేశ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలకు సంబంధించి 52 దరఖాస్తులు రైతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

చంద్రుగొండ: మండలంలోని గానుగపాడు, దామరచర్ల గ్రామాల్లో తొలిరోజు సదస్సులు నిర్వహించారు. రెండు పంచాయతీల్లో 475 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు. కొత్తపాసుపుస్తకాలు, వారసత్వ బదలాయింపులు, భూవివాదాలు, సాదాబైనామా కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో తహసీల్దార్ జి.పుల్లారావు ఆధ్వర్యంలో అబ్బుగూడెం, మర్రిగూడెం పంచాయతీల్లో సదస్సులు జరిగాయిరు. ప్రధానంగా సాదాబైనామ దరఖాస్తులు అధికంగా వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిపూటీ తహసీల్దార్ జగదీశ్వరి, ఆర్ఐ మధు పాల్గొన్నారు.



దమ్మపేట: దమ్మపేట: లచ్చాపురం సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారె



దుమ్ముగూడెం: బండారుగూడెం గ్రామంలో రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు, ప్రజలు



మణుగూరుటౌన్: రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

మార్కెట్లో చిమ్మ చీకట్లు

- పెరిగిన మందుబాబులు, గంజాయి వినియోగదారుల సంచారం
- గోడౌన్‌గా మార్చుకున్న మరికొందరు..
- ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో తీరిది

మణుగూరుటౌన్: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఎండనక, వాననకా రోడ్లపైనే అమ్మకాలు జరుపుతున్న వ్యాపారుల ఆశలు అడియాశలుగానే మిగిలాయి. నిత్యం బొగ్గు, ఇసుక, బీటీపీఎస్‌కు వచ్చే లారీల రాకపోకలతో రోడ్లపై వ్యాపారాలు నిర్వంచలేక అటు వ్యాపారులు, కొనుగోలుకు వచ్చే వినియోగదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీనికితోడు అసంపూర్తిగానే నిలిచిపోయిన ఈ నిర్మాణాల ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

మందుబాబుల అడ్డాగా.. సిమెంట్ గోడౌన్లుగా..

రూ.4.70 కోట్ల వ్యయంతో 2021లో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అసంపూర్తిగా నిలిచిపోవడంతో అసాంఘిక కార్యలాకాలకు అడ్డాగా మారింది. చీకటి పడితే చాలు నిత్యం మందుబాబులు, గంజాయి సేవకుల సంచారం పెరిగిపోతోంది. మద్యం మత్తులో చిన్నపాటి నిర్మాణాలను, బలహీనంగా ఉన్న గోడలను కూల్చడం వంటి పనులకు పూనుకుంటున్నారు. కొందరు వ్యక్తులు ఇంటిగ్రేటేడ్ గదులను సిమెంట్ గోడౌన్‌గా మార్చుకుని అడ్డుగా ఉన్న గదిలో కట్టిన చిన్నపాటి నిర్మాణలను తొలిగించారన్న ఆరోపణలున్నాయి. అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మందుబాబులకు అడ్డాగా, గంజాయి సేవకులకు నీడగా, బడా కాంట్రాక్టర్లకు గోడౌన్‌గా మారింది. ఇప్పటికైనా అసంపూర్తిగా నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



మద్యం సేవించిన ఆనవాళ్లు..



మార్కెట్‌లోని ఓ షెల్టర్‌లో సిమెంట్ నిల్వలు

మౌలిక వసతులు కల్పించాలి

దమ్మపేట: నిరుపేద కూలీల నివాసానికి అవసరమైన మౌలిక వసతులను తక్షణమే కల్పించాలని డిమాండ్ చేస్తూ, మండల కేంద్రం, దమ్మపేటలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మండలంలోని మల్లారం గ్రామ శివారులో ఆవాసాలు ఏర్పరచుకున్న నిరు పేదలకు మౌలిక వసతులు అయిన తాగు నీరు, విద్యుత్ సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ.. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో కాసేపు నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు ధర్మ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల సాయి, మణికంఠ, రాము, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

బీఎస్ఆర్ నగర్‌లో తాగునీటి తిప్పలు

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని బీఎస్ఆర్ నగర్‌లో గడిచిన మూడు రోజులుగా తాగునీటి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానికులు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. మూడు రోజుల క్రితం స్థానిక వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న గేట్ వాల్వ్ మరమ్మతులకు గురి కాగా, ఆ రోజు నుంచి ఇంటింటికీ తాగునీటి సరఫరా ఆగిపోయింది. దాంతో మున్సిపాలిటీ సిబ్బంది బీఎస్ఆర్ నగర్‌లో ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. కాగా, ట్యాంకర్ ద్వారా పూర్తి స్థాయిలో సరఫరా చేయడం లేదని, తమ ఇళ్ల దాకా ట్యాంకర్ వస్తుందా.. రాదా.. అని ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిత్యం ఏదో ఒక ప్రాంతంలో తాగునీటి సమస్య ఏర్పడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు తాగునీటి సరఫరా విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ వాసులు వినతి చేస్తున్నారు.



బీఎస్ఆర్ నగర్‌లో ట్యాంకర్ వద్ద తాగునీరు పట్టుకుంటున్న ప్రజలు

ఎంపీడీఓకు వినతి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని చింతకుంట గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ముత్యాలరావుకు వినతిపత్రం అందజేశారు. టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మేడిపల్లి రాజేష్, మధుసూదన్‌రెడ్డి, సుందర్‌రావు, నాగమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

మణుగూరుటౌన్: బాంబేకాలనీలోని ఎక్స్‌లెంట్ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి ఎల్.మనోజ్ జెఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆల్ ఇండియా 768వ ర్యాంకు సాధించాడు. దీంతో మంగళవారం పాఠశాల యాజమాన్యం తరుపున ఘనంగా సన్మాంచారు. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్ ఎండీ యూసఫ్, యాకూబ్ షరీఫ్‌లు మాట్లాడుతూ.. మనోజ్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు



మణుగూరుటౌన్: ఫెర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ నాగబాబు, ఏఓ రాహుల్‌రెడ్డి



అశ్వాపురం: దుకాణాల్లో తనిఖీ చేస్తున్న సీఐ అశోక్‌రెడ్డి, ఏఓ చటర్జీ

అశ్వాపురం: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్లపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని సీఐ అశోక్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి చటర్జీ అన్నారు. మండల కేంద్రంలో పురుగు మందులు, ఎరువులు, విత్తనాల విక్రయ దుకాణాలను పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. విత్తన కంపెనీ లైసెన్స్, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ప్రతి రైతుకు కొనుగోలు చేసిన వాటిపై బిల్లులు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు ఉన్న విత్తనాలు విక్రయించాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

మణుగూరుటౌన్: పట్టణంలోని ఫెర్టిలైజర్ దుకాణాలను సీఐ నాగబాబు, ఏఓ రాహుల్‌రెడ్డిలు ఆకస్మికంగా మంగళవారం సాయంత్రం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్టాక్ రికార్డులు తనిఖీ చేసారు. స్టాక్ వివరాలు తప్పనిసరిగా బోర్డులపై రాసి వచ్చే వారికి కనపడేలా ఉంచాలని సూచించారు. రైతులకు నగదు బిల్ ఇవ్వాలని సూచించారు. నిషేధిత ఎరువులు, విత్తనాలు రైతులకు అంటగడితే ఉపేక్షించేది లేదన్నారు. పీఓఎస్‌లోనే రసాయనిక ఎరువులు విక్రయాలు జరపాలని సూచించారు. పీసీ, ఓ ఫామ్స్ ఉన్న కంపెనీ మందులు మాత్రమే విక్రయాలు జరపాలన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన దుకాణాల్లో జరిగిన విక్రయాలు రాతపూర్వకంగా వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఎంఆర్‌పీ ధరలకు మాత్రమే నాణ్యమైన ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మేడ ప్రసాద్, ఏఈఓ లక్ష్మణరావు సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. స్థానిక రైతు వేదిక భవనంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నాణ్యమైన విత్తనం– రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా అశ్వారావుపేట మండంలలోని 19 రెవెన్యూ గ్రామాలకు మంజూరైన 19 యూనిట్ల వరి విత్తనాలు, 38 యూనిట్ల పెసర విత్తనాలను ఎంపిక చేసిన ఆయా రైతులకు స్థానిక వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఏఓ పి.శివరామప్రసాద్, ఏఈఓలు ఆరేపల్లి సతీష్, ఎస్‌కె.షాకీరా భాను, నార్లపాటి రవీంద్ర, సూరిబాబు పాల్గొన్నారు.

ములకలపల్లి: నాణ్యమైన విత్తనాలతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించవచ్చని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ నాగాంజలి సూచించారు. 'నాణ్యమైన విత్తనం– రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో గ్రామంలో ఎంఏఓ అరుణ్‌బాబు అధ్యక్షతన మంగళవారం ములకలపల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. పంటల సాగులో నాణ్యమైన విత్తన ప్రాముఖ్యతను గుర్తించి, జయశంకర్ వ్యవసాయ యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఈయేడు ఎంపిక చేసిన రైతులకు విత్తనాలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. తదుపరి పలువురు రైతులకు వరి, పెసర విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మనోహర్, రమేశ్, రాహుల్, రైతులు పాల్గొన్నారు.

అశ్వాపురం: రైతులు నాణ్యమైన విత్తనాలనే సాగు చేయాలని తద్వారా దిగుబడులు పెరుగుతాయని మండల వ్యవసాయ అధికారి చటర్జి అన్నారు. జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపడుతున్న 'నాణ్యమైన విత్తనం–రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఏఓ చటర్జి మాట్లాడుతూ.. ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాన్ని వాడినప్పుడు దిగుబడులు కనీసం 10 నుంచి 15 శాతం పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సౌమ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: నాణ్యమైన విత్తనాలతోనే వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధ్యమని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ దానం స్రవంతి పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వం వినూత్నంగా శ్రీకారం చుట్టిన 'నాణ్యమైన విత్తనం– రైతన్నకు నేస్తం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని భట్టుపల్లి రైతు వేదికలో పలువురు రైతులకు విత్తనాలను పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాన్ని వాడినపుడు దిగుబడులు పెరిగే అవకాశాన్ని ఉందని అన్నారు. ఏఓ ఛటర్జీ, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రశాంత్, అనిల్ కుమార్,రైతులు ఎర్ర సురేష్, రాందాస్, వజ్జా సాంబశివరావు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: నాణ్యమైన విత్తనాలు రైతులకు నేస్తమని వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ మధుసుదన్‌రెడ్డి అన్నారు. నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చంద్రుగొండలోని రైతువేదికలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులనుద్దేశించి మాట్లాడుతూ వరి, పెసర, మినుములు, నాణ్యమైన విత్తనాలను మండలంలోని రెవెన్యూ గ్రామంలోని ఒక రైతుకు అందించారు. కార్యక్రమంలో ఏడీఏ రవికుమార్, ఏఓ వినయ్, ఏఈఓలు సాయిభాను, శ్రీనివాసరావు, అరుణ పాల్గొన్నారు.



అశ్వారావుపేటరూరల్: రైతుకు విత్తనాల బ్యాగ్‌ను అందిస్తున్న కళాశాల డీన్ హేమంత్ కుమార్



చంద్రుగొండ: రైతుకు విత్తనాలు అందజేస్తున్న ఏడీఏ రవికుమార్

బస్ షెల్టర్లు లేక అవస్థలు

- ప్రధాన కూడళ్లలో కనబడని బస్సు ప్రాంగణాలు
- ఉన్న షెల్టర్లూ శిథిలావస్థకు..
- ప్రయాణికుల ఇక్కట్లు

పినపాక: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టినప్పటి నుంచి ప్రయాణికుల రద్దీ పెరిగింది. నిత్యం వందల ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణాలు సాధిస్తున్నారు. కానీ బస్సుల కోసం బస్ షెల్టర్లు లేక రోడ్డుపై నిలబడటం వారిని ఇబ్బందులకు గురిచేస్తుంది.

ప్రధాన కూడళ్ల వద్ద..

ప్రధాన కూడళ్లు అయినా పినపాక, బయ్యారం క్రాస్ రోడ్, బీటీపీఎస్, కరకగూడెం వంటి చోట్ల బస్సు ప్రాణాలు లేవు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం ఎండలో రోడ్లపై నిలబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. వర్షాకాలంలో మరింత తీవ్రంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.




బయ్యారం క్రాస్ రోడ్డు వద్ద బస్సు కోసం రోడ్డుపై వేచిచూస్తున్న స్థానికులు

శిథిలావస్థకు బస్సు షెల్టర్లు..

పినపాక, బయ్యారం గ్రామంలోని పై సెంటర్ వద్ద నిర్మించిన బస్ షెల్టర్లు శిథిలావస్థకు చేరాయి. అక్కడ వరకు బస్సులు వెళ్లకపోవడం, అధికారులు వాటిరి పట్టించుకోకపోవడం వల్ల అధ్వానంగా తయారయ్యాయి. జానంపేట గ్రామంలో రైతులు చందాలు వేసుకుని ప్రయాణకుల కోసం ప్రత్యేకంగా బస్ షెల్టర్ నిర్మించారు. బయ్యారం గ్రామంలో పంచాయతీ నిధులతో పాత బస్ షెల్టర్‌ను అభివృద్ధి చేశారు.

రోడ్లపై నిలబడాల్సిన పరిస్థితి..



బస్సులో సమయానికి రాక రోడ్లపై నిలబడాల్సిన పరిస్థితి ఉంది. ఎండ, వాన నుండి ఉపశమనం కోసం చెట్టు, దగ్గర ఉన్న షాపుల ఎదుట వేచి చూడాల్సిన పరిస్థితి. అధికారుల స్పందించి బయ్యారం క్రాస్ రోడ్‌లో బస్సు షెల్టర్ నిర్మించాలి.

– స్వాతి, జానంపేట

ప్రధాన కూడళ్లలో నిర్మించాలి..



నిత్యం జానంపేట, బయ్యారం క్రాస్ రోడ్, బీటీపీఎస్ వద్ద బస్సు కోసం రోడ్డుపై నిలబడి ఉంటున్నాం. ఎండలో బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉంటోంది. అధికారుల స్పందించి ప్రధాన కూడలిల్లో బస్సు షెల్టర్లు నిర్మించాలి.

– రజిని, దుగినేపల్లి



శిథిలావస్థకు చేరిన బయ్యారం పైసెంటర్ బస్ షెల్టర్